# సత్సంకల్పాలున్నప్పుడే సత్పుత్రులు కల్గుతారు

రమణీ శిరోమణులు రావచ్చు, పోవచ్చు
శాశ్వతమైనది సత్య మొకటె
రాజ్యభోగములన్ని రావచ్చు, పోవచ్చు
శాశ్వతమైనది సత్య మొకటె
భ్రాతలు, బంధువుల్ రావచ్చు, పోవచ్చు
శాశ్వతమైనది సత్య మొకటె
అధికార భోగముల్ రావచ్చు, పోవచ్చు
శాశ్వతమైనది సత్య మొకటె

సత్యమే సరస సన్మార్గ తత్త్వము
సత్యమే సకల సౌభాగ్యదాయకమ్ము
సత్యమే అమృతత్త్వమునకు మార్గము
సత్య మొక్కటె జగతిలో శాశ్వతమ్ము!

ప్రేమస్వరూపులారా! భూమిలో మనం ఎట్టి విత్తనములు నాటుదుమో అట్టి ఫలములే లభిస్తాయి. మామిడి విత్తనములు నాటి చేదు ఫలములను పొందలేము. వేప విత్తనములను నాటి మధురమైన మామిడి ఫలములను అందుకోలేము. తల్లిగర్భం భూదేవితో సమానం. అందులో ఎలాంటి సంకల్పములను నాటితే అలాంటి ఫలములను అందుకోవలసివస్తుంది. కనుక మాతృమూర్తి తన గర్భమును సత్యసంకల్పములచేత, సద్భావములచేత నింపుకోవాలి. అప్పుడే ఆమెకు సదాచారసంపన్నులు, సద్గుణవంతులైన పుత్రులు కల్గుతారు. ఇందుకు ఆర్యాంబ చక్కని ఉదాహరణ. ఆమె నిరంతరము దైవచింతన చేస్తూ, దైవకార్యములందే నిమగ్నమై ఉండేది. తత్ఫలితంగా ఆమె పవిత్ర గర్భమునందు జగద్గురువులైన ఆది శంకరాచార్యులవారు జన్మించారు. వివేకానందుడుగాని, రామకృష్ణపరమహంసగాని వారి వారి తల్లులయొక్క

sri sathyasai vachanamrutam

సద్గుణములు, సత్సంకల్పములచేతనే మహనీయులుగా రూపొందినారు. తల్లియొక్క సత్సంకల్పములచేతనే పుత్రులు సత్పురుషులుగా రూపొందుతారు. కనుక, తల్లులు ఉత్తమమైన భావములను, సత్సంకల్పములను అభివృద్ధి పరచుకోవాలి, ఉత్తమ ప్రవర్తనతో మెలగాలి.

పుతలీబాయి పేరు మీరు వినే ఉంటారు. ఆమె ఒక వ్రతము నాచరించేది. ఆ వ్రతము పూర్తి అయిన తరువాత కోకిల కూత వినిపిస్తేగాని ఆమె భోజనం చేసేదికాదు. ఒకనాడు ఎంతసేపైనా కోకిల కూత వినిపించలేదు. కోకిల కూత వినిపించేంతవరకు తన తల్లి భోజనం చేయదని కుమారుడు గుర్తించాడు. వెంటనే ఇంటివెనుకకు వెళ్ళి కోకిల కూసినట్లు కూసి, లోపలికి వచ్చి "అమ్మా! కోకిల కూసింది కదా! ఇక నీవు భోజనం చేయవచ్చు" అన్నాడు. తన కొడుకు అబద్ధం చెబుతున్నాడని గుర్తించి తల్లి చాల బాధపడింది. "భగవంతుడా! నేనేమి పాపం చేశానో కదా నా గర్భంలో ఇలాంటి అసత్యవాది జన్మించాడు" అని విలపించింది. అది చూసి కుమారుడుకూడా చాలా బాధపడి, ఇకపైన తాను అసత్యమాడనని ప్రమాణం చేశాడు. అతడే గాంధీ. ఆనాటినుండి అతడేనాడూ అసత్యమాడలేదు. తల్లియొక్క శిక్షణ పిల్లలకు అత్యవసరం. పిల్లలు తప్పు చేసినప్పుడు ఉపేక్షించకుండా వారిని మందలించి, శిక్షించి సరియైన మార్గంలో ప్రవేశపెట్టాలి. తప్పుకు తగిన శిక్ష, మంచికి తగిన సత్ఫలితాన్ని అందించాలి.

పుతలీబాయివద్ద రంభ అనే సేవకురాలు ఉండేది. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లు పుతలీబాయివలె రంభకూడా పవిత్రమైన హృదయం కల్గినది. ఒకనాడు పిల్లవాడైన గాంధీ ఆమెవద్దకు పరుగెత్తుకొని వచ్చి "రంభా! నాకు చాలా భయంగా ఉంది" అన్నాడు. అప్పుడామె "నాయనా! సర్వజగద్రక్షకుడైన శ్రీరామచంద్రుడుండగా నీకు భయమెందుకు? నీకు భయమనిపించినప్పుడల్లా రామనామాన్ని స్మరించు" అని సలహా ఇచ్చింది. ఆనాటినుండి గాంధీ తాను తుదిశ్వాస వదిలేంతవరకు నిరంతరము రామనామాన్ని స్మరిస్తూ వచ్చాడు.

**"మొదట అమ్మకు....."**

పిల్లల మంచి, చెడ్డలు తల్లియొక్క సంకల్పములపైననే ఆధారపడి యున్నాయి. ఒక చిన్న ఆదర్శం. పూర్వం రంగూన్ యుద్ధంలో తమవారందరినీ కోల్పోయి ఒక తల్లి, కుమారుడు ఏదోవిధంగా మద్రాసు చేరుకొన్నారు. వారికి తినటానికి తిండిగాని, ఉండటానికి ఇల్లుగాని లేవు. తల్లి ప్రతిరోజూ ఇంటింటికీ పోయి భిక్షమెత్తి, తనకు లభించింది మొదట కుమారునికి

sri sathyasai vahamrutam

పెట్టి, మిగిలింది తాను తినేది. ఒక్కరికి మాత్రమే సరిపడే ఆహారం లభించిన రోజున కుమారునికి పెట్టి తాను పస్తుండేది. తత్ఫలితంగా క్రమక్రమేణ ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఒకనాడు కుమారుడు "అమ్మా! నీవు భుజించకుండా నాకు మాత్రమే పెడుతున్నావు. రేపటి నుండి నేనే భిక్షాటనకు వెళతాను" అన్నాడు. "నాయనా! నీవు భిక్షమెత్తటం నేను సహించలేదు, భరించలేను," అంది. కాని ఆమె చాలా బలహీనంగా ఉండటంచేత కుమారుడు పట్టుబట్టి తానే భిక్షాటనకు బయల్దేరినాడు. ఒక పెద్ద ఆఫీసరు ఇంటిముందు నిలబడి "అయ్యా! నాకు ఆకలి, ఆకలి" అని కేక పెట్టాడు.

ఆ సమయంలో ఆ ఆఫీసరు వరండాలోని ఈజీ చైర్‌లో కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. వెంటనే ఆయన లోపలికి వెళ్ళి ఒక ఆకులో అన్నం పెట్టి తీసుకువచ్చి "నాయనా! ఇక్కడ కూర్చుని భుజించు" అన్నాడు. ఆ పిల్లవాడు "లేదు, నేను ఇంటికి తీసుకుపోతాను" అన్నాడు. ఆఫీసరు "నీకు ఆకలిగా ఉంటే ఇక్కడే భుజించవచ్చు కదా! ఇంటికెందుకు తీసుకువెళ్ళాలి?" అన్నాడు. ఈ మాటలు అంటూండగానే ఆ పిల్లవాడు తల తిరిగి క్రిందపడిపోయాడు. పడిపోయి ఏదో మాట్లాడుతున్నాడు. ఏమి చెబుతున్నాడో వినాలని ఆయన తన చెవిని ఆ పిల్లవాని నోటి దగ్గర పెట్టాడు. ఆ పిల్లవాడు హీనస్వరంతో "అయ్యా! మొదట మా అమ్మకు పెట్టి తరువాతనే నేను తింటాను. మొదట అమ్మకు, మొదట అమ్మకు........." అంటూ ప్రాణం వదిలాడు. అట్టి మాతృప్రేమ కల్గిన కుమారులు నేడీ లోకంలో ఎక్కడైనా కనిపిస్తున్నారా? ఈ కలి ప్రభావం వలన, ఆధునిక విద్యవలన నేటి పిల్లలు కుటుంబ క్షేమాన్ని, దేశక్షేమాన్ని ఏమాత్రమూ దృష్టియందుంచుకోవటం లేదు.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ బాల్యంలో చాలా పేదరికాన్ని అనుభవించాడు. తల్లి తాను కష్టపడి సంపాదించిన డబ్బుతో తనయుని పోషిస్తూ, చదివిస్తూ వచ్చింది. ఆమె ఏనాడూ తన సుఖాన్ని చూసుకోలేదు. తన కుమారుడు సుఖంగా ఉంటే చాలని భావించింది. అతడు పవిత్రమైన జీవితాన్ని గడపాలని ఆశించింది. విద్యాసాగర్ చదువుపట్ల శ్రద్ధ కల్గినవాడు. రాత్రిపూట వీథిదీపాల క్రింద కూర్చొని చదువుకునేవాడు. ఆవిధంగా కష్టపడి చదివి ఉన్నత విద్యలో ఉత్తీర్ణుడైనాడు. తరువాత ఉద్యోగంలో చేరాడు. అయితే మొదట అతనికి చాలా తక్కువ జీతం వచ్చేది. ఆ తక్కువ జీతంతోనే తల్లిని పోషిస్తూ వచ్చాడు.

sri sathyasai vahamrutam

ఒకనాడు ఇరుగుపొరుగువారు తిరునాళ్లకు వెళుతుంటే, అతని తల్లికూడా వారివెంట వెళ్ళింది. కాని ఆమెకు కట్టుకోవడానికి మంచి చీరలేదు. ఏదో ఒక పాతచీర కట్టుకుని బయల్దేరింది. అది చూసి విద్యాసాగర్ చాలా బాధపడ్డాడు. ఆ రోజు సాయంకాలమే తల్లికోసం మంచి చీరలను కొని తెచ్చాడు. క్రమక్రమేణ అతడు మంచి స్థితికి వచ్చాడు. అతని జీతంకూడా బాగా పెరిగింది. ఒకనాటి సాయంకాలం తల్లీ కొడుకులు మాట్లాడుకుంటున్న సమయంలో "అమ్మా! నీకేమైనా కోరికలుంటే చెప్పు, వాటిని నా శక్తికొలదీ తీరుస్తాను" అన్నాడు. అప్పుడామె "నాయనా! మన గ్రామప్రజలు త్రాగునీరు తెచ్చుకోవడానికి ఎంతో దూరం వెళ్లవలసివస్తోంది. కనుక నీవు మన పల్లెలో ఒక బావిని త్రవ్విస్తే నేను చాలా సంతోషిస్తాను"అన్నది. విద్యాసాగర్ వెంటనే ఒక బావిని త్రవ్వించి ప్రజల దాహార్తిని తీర్చాడు. తల్లి ఎంతో ఆనందించి "నాయనా! దేహానికి నీరు చాలా ప్రధానమైనది. ప్రాణసమానమైన నీరును ప్రజలకు అందించి మహోపకారం చేశావు" అని కొనియాడింది. మరొకనాటి సాయంకాలం విద్యాసాగర్ " అమ్మా! నీకింకా ఏమైనా కోరికలున్నాయా?" అని అడిగాడు. "నాయనా! మన గ్రామంలోని చిన్న చిన్న పిల్లలు చదువుకోసం ప్రక్క గ్రామానికి వెళ్ళవలసి వస్తోంది. కాబట్టి ఇక్కడొక చిన్న బడిని నిర్మించు" అన్నది. అతడు తన వద్ద మిగిలిన డబ్బుతో ఒక స్కూలు కట్టించాడు. పిల్లలు ఆ స్కూలుకి ఆనందంగా ఆడుతూ, పాడుతూ వెళ్లటం చూసి తల్లి చాలా ఆనందించింది. "నాయనా! ఇది మనగ్రామానికే కాదు, దేశానికే గొప్ప ఆదర్శం. నీ జన్మ ధన్యమైంది. నీవంటి సత్పుత్రుడు నా గర్భమున పుట్టినందుకు నాకెంతో ఆనందంగా ఉంది" అన్నది.

మరొకనాటి సాయంకాలం విద్యాసాగర్ ఆఫీసునుండి తిరిగి వచ్చేసరికి తల్లి ఏదో దీర్ఘాలోచనలో మునిగియుండటం గమనించి కారణమడుగగా "నాయనా! నీవు ప్రజలకు నీరందించావు. స్కూలు కట్టించావు. కాని, ఇక్కడొక  ఆసుపత్రి లేకపోవటం వల్ల పిల్లలకు ఏదైనా అనారోగ్యం కలిగితే చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. కాబట్టి ఒక వైద్యశాలను నిర్మించు," అని కోరింది. విద్యాసాగర్ వెంటనే ఒక చిన్న ఆసుపత్రిని కట్టించాడు. అందులో ఒక డాక్టరును, ఒక నర్సును నియమించాడు. ఇవన్నీ మీకు ఎందుకోసం  చెబుతున్నానంటే తల్లియొక్క సంకల్పములు ఉత్తమమైనవిగా ఉండాలి. తల్లియొక్క ఉత్తమమైన సంకల్పములను ఆచరణలో పెట్టటానికే తానామె గర్భంలో జన్మించితినన్న సత్యాన్ని కుమారుడు గుర్తించాలి.

## ఈశ్వరమ్మ కోరిన మూడు కోరికలు

ఈ దేహానికి సంబంధించిన విషయంలోకూడా ఈవిధంగానే జరిగింది. నేను ఒకనాడు పైన భోజనం చేస్తున్న సమయంలో 'గృహం అమ్మాయి' (ఈ దేహమునకు తల్లి) పైకి వచ్చింది. "ఏమి ఇలా వచ్చావమ్మా?" అని అడిగాను. "భోజనం చేయండి, తరువాత చెబుతాను" అన్నది. భోజనం అయిన తరువాత చెప్పింది – "స్వామీ! మనది చాలా కుగ్రామము. ఇక్కడ వైద్య సౌకర్యం లేక ప్రజలు చాలా బాధపడుతున్నారు. చంటి బిడ్డలకు జ్వరం వస్తే వారినెత్తుకుని బుక్కపట్నం పరుగెత్తవలసివస్తోంది" అంది. అప్పుడు నేనీ గ్రామంలో ఒక ఆసుపత్రిని కట్టిస్తానని చెప్పి, మొట్టమొదట చిన్నది కట్టించాను.

మరొక దినము ఆమె పైకి వచ్చి "స్వామీ! మీరు ఏమీ అనుకోకూడదు. నాకు మరొక కోరిక ఉన్నది మీరు తీర్చాలి" అంది. "నీకూ కోరికలు పెరుగుతున్నాయా?" అన్నాను చిరుకోపం నటిస్తూ. "స్వామీ! ఇన్ని వేలమంది కోరికలు తీరుస్తున్నావే! మరి నాకోరిక మాత్రం ఎందుకు తీర్చకూడదు?" అంది. "సరే, ఏమి నీ కోరిక?" అని అడిగాను. "స్వామీ! మన గ్రామప్రజలు నీటి ఎద్దడితో సతమతమౌతున్నారు. ఒక చిన్న బావిని త్రవ్వించండి" అన్నది. అప్పుడు మన మందిరంలోనే ఒక చిన్న బావినిత్రవ్వించాను. గ్రామ ప్రజలందరూ ఇక్కడికి వచ్చి నీరు తీసుకుపోయేవారు. ఈశ్వరమ్మ "స్వామీ! నాకు చాలా ఆనందముగా ఉన్నది.కాని నాలో మరొక కోరిక మిగిలిపోయింది" అన్నది. "ఏమిటది?" అని అడిగాను. మనగ్రామంలోని పిల్లలు చదువుకోసం బుక్కపట్నమునకు నడచి వెళ్ళవలసివస్తోంది. పాపం, వారు అంతదూరం నడవలేక చాలా బాధపడుతున్నారు. కాబట్టి మనగ్రామంలో ఒక స్కూలు కట్టించండి" అని కోరింది. ఆమె కోరిక ప్రకారం ఒక స్కూలు కట్టించాను. ఈశ్వరమ్మ చాలా సంతోషించింది.

చిన్న విత్తనమే పెద్ద వృక్షంగా మారిపోయినట్లు, ఆనాడు కట్టించిన చిన్న స్కూలే ఈనాడు పెద్ద యూనివర్సిటీగా మారిపోయింది. ఆనాడు కట్టించిన చిన్న ఆసుపత్రియే ఇప్పుడు పెద్దసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మారిపోయింది. ఆనాడు చిన్న బావిని త్రవ్వించినవానిని ఈనాటి జిల్లా అంతటికీ ట్యాప్స్ వేయించి చక్కని నీరందించాను. సంకల్పములు ఉత్తమమైనవిగా ఉన్నప్పుడు అవి తప్పకుండా నెరవేరుతాయి. ఏదైనా మంచిపని సంకల్పించుకుంటే అది తప్పక జరిగిపోతుంది. దానికి కావలసిన ధనము లేదే, శక్తి లేదే, అని సందేహించటం పెద్ద

sri sathyasai vachanamrutam

బలహీనత. మీ సంకల్పం పవిత్రమైనదిగా ఉంటే, ఆ సంకల్ప బలమే మీకు తగిన శక్తి నందిస్తుంది.

## చైతన్యుని ఆదర్శం

ఒకానొక సమయంలో చైతన్యుడు తల్లియైన శచీదేవితోపాటు దేవాలయమునకు వెళ్ళాడు. అక్కడ చైతన్యమూర్తిని దర్శించి "స్వామీ! నాకు దేహసంబంధమైన వాంఛలు లేవు. కాని, ఒక్క కోరిక మాత్రం ఉన్నది. నిన్ను ప్రేమించే శక్తి నాకు కావాలి. ఇంక ఏదీ నాకు అక్కర్లేదు. ఎందుకంటే నీవు ప్రేమస్వరూపుడవు. ప్రేమయే మా ప్రాణం, ప్రేమయే మా జీవితం. సర్వమూ ప్రేమయందే ఇమిడియున్నది. కాబట్టి నిన్ను ప్రేమించే శక్తిని నాకు అనుగ్రహించు" అని ప్రార్థించాడు. ప్రక్కనే ఉన్న తల్లి "నాయనా! కనీసం తినటానికి తిండి, నిలువడానికి నీడ అయినా ఉండాలి కదా! ఏమీ వద్దంటున్నావేమిటి?" అని అడిగింది. చైతన్యుడు "అమ్మా! ఇంత వయసొచ్చినా నీవు భగవత్తత్త్వాన్ని తెలుసుకోలేకపోతున్నావు. ఒక్క భగవత్ప్రేమను పొందితే మనకు కావలసినదంతా సిద్ధిస్తుంది. చిన్న చిన్న కోరికలతో జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదు" అన్నాడు. లోకంలో మంచిని చెడు వెంటాడుతూనే ఉంటుంది. మంచివారికి అనేక కష్టాలు వస్తుంటాయి. అయితే ఆ కష్టాలు వారిలోనే మంచిని మరింత అభివృద్ధిపరుస్తాయి.

కష్టసుఖములు రెండును కలిసియుండు
వీని విడదీయు టెవ్వరి వశము కాదు
సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము
కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు

చైతన్యుడు వీథులలో తిరుగుతూ కృష్ణభజన చేస్తుంటే, కొందరు దుర్మార్గులు అతని చేతుల్లోని చిడుతలను లాక్కొని పోయేవారు. కాని, చైతన్యుడు చెక్కు చెదరని విశ్వాసంతో, దృఢసంకల్పంతో వీథి వీథిలోనూ తిరుగుతూ కృష్ణభజనను కొనసాగించాడు. క్రమక్రమేణ అనేకమంది పిల్లలు అతనితో చేరి కృష్ణభజన చేస్తూ వచ్చారు. వారి తల్లిదండ్రులు అడ్డు పెట్టినప్పటికీ ఆ పిల్లలు చైతన్యమార్గమును ఏమాత్రమూ వదలలేదు. చైతన్యుడు ఆ పిల్లలను తనవద్ద కూర్చోబెట్టుకుని వారికి ఆధ్యాత్మిక విషయాలను బోధించేవాడు.

srisathyasaivachanamrutam

**త్యాగం పెరిగినకొలదీ తేజం పెరుగుతుంది**

ప్రాచీన కాలమునుండి భారతదేశము త్యాగభూమిగా, యోగభూమిగా, కర్మభూమిగా ప్రసిద్ధి కెక్కినది. ఇలాంటి పవిత్రమైన భూమిలో జన్మించినందుకు మీరు త్యాగభావాన్ని అభివృద్ధి పరచుకోవాలి. ఎంత త్యాగం చేస్తారో మీ తేజస్సు అంత అభివృద్ధి అవుతుంది. ఒక చిన్న విషయం మీకు చెబుతున్నాను. నా చుట్టూ దివ్యతేజస్సు ఎప్పుడూ ఉండనే ఉంది. కాని, గడచిన పదహైదు రోజులనుండి నా తేజస్సు చాలా పెరిగిపోయిందని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కారణమేమిటి? పల్లెప్రజల సంక్షేమంకోసం ఏవైనా కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పం ఇంతకు పూర్వంనుండి నా మనస్సులో ఉన్నటువంటిదే. కాని విద్య, వైద్య, మంచినీటి పథకాలలో నిమగ్నమైయుండటంచేత దీనిపై నేనంతగా దృష్టిపెట్టలేదు. అయితే ఒక నెల పూర్వం నేను కుర్చీలో కూర్చొని ఉండగా అక్కడొక చిన్న పేపరు కనిపించింది. దానిని తీసుకొని చూస్తే అందులో ఒక విచారకరమైన వార్త ఉండినది. ఒక నిరుపేదరాలైన తల్లివద్దకు ఆమె కుమారుడు వచ్చి 'అమ్మా! ఆకలి, ఆకలి' అని అడిగాడు. వానికి పెట్టటానికి ఆమె వద్ద ఏమీ లేదు. ఆ సమయంలో విపరీతంగా వర్షాలు కురుస్తూ ఉండటం చేత భిక్షాటనకు వెళ్లటానికికూడా ఆమెకు వీల్లేకపోయింది. వర్షం నిలిచే సూచనలు కనిపించలేదు.

అలాంటి పరిస్థితిలో కుమారునికి ఏమి పెట్టగలనని చాలా బాధపడింది. ఆబాధను తట్టుకోలేక ఎలుకల మందును నీటిలో కలిపి కుమారునికి త్రాగించి తానూ త్రాగింది. ఇద్దరూ మరణించారు. "అన్నపూర్ణ అని పేరొందిన ఈ పవిత్ర భారత క్షేత్రంలో బీదలకు తిండి కరువైపోయిందా" అని నాకు చాలా బాధ కలిగింది. తక్షణమే అన్ని కార్యములనూ వదలిపెట్టి గ్రామసేవకు ప్రారంభించాను. గ్రామ గ్రామానికి అన్నవస్త్రాదులను పంపి ఆ ప్రజలకు ఆనందోత్సాహాలను కల్గించాను. మా పిల్లలు బంగారంవంటివారు; ఎంతగానో కష్టపడి పనిచేశారు. తెల్లవారినది మొదలుకొని రాత్రివరకు గ్రామాల్లో తిరుగుతూ ఉత్సాహంగా సేవ చేశారు. పల్లెపల్లెకూ వెళ్లారు, ఇంటింటికీ వెళ్ళారు. అది నాకెంతో ఆనందాన్ని కలిగించింది. త్యాగం పెరిగినకొలదీ తేజంకూడా పెరుగుతుంది. నేను తీసుకునే ఆహారంలో ఎలాంటి మార్పు లేదు. నేను ఉదయం భజన అయిన తక్షణమే ఇంత సంకటి, ఇంత ఆకుపచ్చడి, ఇంత ఆకుకూర తీసుకుంటాను. దీనిలో మార్పు లేదు. అప్పటి భోజనమే ఇప్పుడు కూడను.

sri sathyasai vahini

అయినప్పటికీ నా తేజస్సు అభివృద్ధి అవుతూ వచ్చింది. ప్రజాక్షేమమే పరమాత్మునికి అందము.

ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనప్పుడు మీకు ఎంతైనా క్షేమం కల్గుతుంది. నేను భక్తుల మధ్య నెమ్మదిగా నడుస్తుంటే, కొంతమంది "స్వామి కాలికి దెబ్బ తగిలిందేమో! లేకపోతే ఎందుకింత నెమ్మదిగా నడుస్తున్నారు.?" అనుకుంటారు. నేను మెల్లమెల్లగా నడవటం ఎందుకంటే, మీకందరికీ ఎక్కువసేపు దర్శనం ఇవ్వటానికే! నాకు కాళ్ళనొప్పి లేదు, ఎట్టి బాధలూ లేవు. ఆనందంగా ఉంటున్నాను. అయితే, గ్రామసేవ ప్రారంభించిననాటినుండి నా ఆనందం దినదినాభివృద్ధి పొందుతున్నది. కనుక, మీరుకూడా ఇకపైన ప్రజాసేవను ప్రాణసమానంగా భావించాలి. అప్పుడు మీయందుకూడ దైవతేజస్సు ఉట్టిపడుతుంది. దైవం మీకంటే ప్రత్యేకంగా లేదు. దైవం ఎక్కడో మందిరంలోనో, మసీదులోనో ఉన్నాడని మీరు భావించకూడదు. దేహమే దేవాలయమని, దేహంలో ఉన్న జీవుడే దేవుడని మీరు విశ్వసించాలి. దేవుణ్ని వెదకటానికి మీరు ఎక్కడికీ పోనక్కర్లేదు. అంతర్దృష్టిని అభివృద్ధి పరచుకోండి. ఆనంద స్వరూపుడు కనిపిస్తాడు.

మీరే దైవస్వరూపులు. కాని, మీరు దేహాభిమానంచేత మానవులమని భ్రమిస్తున్నారు. దేహాభిమానాన్ని తగ్గించుకొని దైవాభిమానాన్ని పెంచుకున్నప్పుడే మానవుడు దేవుడవుతాడు. మానవత్వం, దైవత్వం ప్రత్యేకంగా లేవు. రెండూ బింబప్రతిబింబములే! "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అన్నారు. సత్యమార్గంలో ప్రవేశించాలి. అదే బ్రహ్మతత్త్వం. బ్రహ్మతత్త్వమును తెలుసుకోవటానికి ఎక్కడికో పోనక్కర్లేదు. దేహమే దేవాలయమని భావించాలి. అప్పుడు మీరు అపరిమితమైన ఆనందాన్ని అనుభవిస్తారు; సర్వశక్తులూ మీలో ప్రవేశిస్తాయి. అయితే ఇది అంతసులభంగా రాదు. జన్మజన్మల సంస్కారం చేతనే ఇది ప్రాప్తిస్తుంది. మీరు ఏ పని చేసినా అది దైవకార్యంగా భావించండి. ఆఫీసుకు పోవటం దైవకార్యం ఎట్లవుతుంది? అని కొంతమంది ప్రశ్నిస్తారు. అదికూడా దైవకార్యమే. ఎందుకంటే అంతా దైవస్వరూపమే. "సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్.." కనుక ఏ కర్మల నాచరించినా భగవత్ప్రీత్యర్థమనే భావంతో చేయండి.

**19.11.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam